# హంసలను వేటాడొద్దు [4]


మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్




**అనువాదం:** హంసలను వేటాడొద్దు [4]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఏప్రిల్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2249

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [4]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** యెగార్ పొలుష్కిన్ అమాయకుడు. కానీ నిపుణుడైన వడ్రంగి. భార్య హారిటీనా అతణ్ణి అసమర్థునిగా జమకట్టి నిత్యం నస పెడుతూ, దెప్పి పొడుస్తూ ఉంటుంది. హారిటీనా చెల్లి మార్యా, ఆమె భర్త ఫ్యొడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ లు కూడా అదే ఊళ్ళో ఉంటారు. ఫ్యొడార్ యెగార్ చేతే తన ఇల్లు కట్టించుకుంటాడు. తర్వాత యెగార్ కి కొత్త పని దొరకటం కష్టమవుతుంది. దొరికిన చోట మాత్రం తన నైపుణ్యమంతా వాడి ఎంతో ఆస్వాదిస్తూ పని చేస్తాడు. ఈ పద్ధతి వల్ల ఎక్కడా రెండు వారాల కన్నా ఎక్కువ పని చేయలేకపోతాడు. ఒక చోట మున్సిపల్ కాలవ తవ్వమని పని పురమాయిస్తే చీమల పుట్టని రక్షించటానికి దాని చుట్టూ తవ్వుతాడు. ఈ విషయం అందరికీ తెలిసి నవ్వులపాలవుతాడు. కొడుకు కోల్కా బడిలో కూడా ఒక కుర్రాడు ఈ విషయమై యెగార్ ని పరిహాసం చేస్తే కోల్కా సహించలేక అతని పళ్లూడగొట్టి బడి మానేస్తాడు. యెగార్‌కి ఒక ఉద్యోగం దొరుకుతుంది. ఊరి పక్కన ఒక నది దగ్గర నెలకొన్న పర్యాటక ప్రదేశంలో చేరతాడు. అక్కడ పడవనీ, రేవునీ చూసుకునే పని అతనికి. అధికారి యకోవ్ ప్రొకొపిచ్ అక్కడ ఎలా మసలుకోవాలో యెగార్ కి పూసగుచ్చినట్టు చెప్తాడు. **ఇక చదవండి:——**

## 4

ఇప్పుడు కోల్కా క్రమం తప్పకుండా బడికి వెళుతున్నాడు. టీచరు కంటే కూడా అరగంట ముందు చేరుకుంటున్నాడు. టీచరు పాఠాలు చెబుతున్నప్పుడు కదలకుండా కూర్చునేవాడు. ఆసక్తికరమైన పాఠమైతే, ఉదాహరణకు జంతువులు, చరిత్ర, భూగోళ శాస్త్రానికి సంబంధించినవైతే అతడు నోరు తెరుచుకుని మరీ వినేవాడు. ప్రతి ఒక్కళ్లు, తరగతి మొత్తం ఈ క్షణం కోసమే వేచి ఉండేవాళ్లు. అతడి నోరు తెరుచుకోగానే అందరూ గడ్డకట్టుకుపోయేవాళ్లు. టీచరు చూడకుండా వోవా చిన్న వెదురు గొట్టం తీసి కాగితం నమిలిన ఉండలు దాంట్లో పెట్టి గురిచూసి ఊదేవాడు – అది నేరుగా వెళ్లి కోల్కా తెరిచి ఉన్న నోట్లో పడేది. భలే తమాషాగా ఉండేది!

కోల్కాకి ఇలా ఎన్నిసార్లు జరిగిందో ఎవరికీ లెక్కలేదు. ఇలా జరిగిన ప్రతిసారి నోరు మూసుకునే ఉండాలని అనుకుని కోల్కా పెదాలను గట్టిగా బిగించిపెట్టేవాడు. అయితే టీచరు

చారిత్రిక వీరుల గురించి చెప్పటం మొదలుపెట్టగానే, లేదా పద్యాలు చదవటం మొదలుపెట్టగానే అతడు తనను తాను మరిచిపోయేవాడు. ఏదో ప్రపంచంలో విహరిస్తూ టీచరు చెప్పే ప్రతి పదాన్నీ పట్టుకోటానికి ప్రయత్నించేవాడు. అందుకేనేమో ఒక్క పదం కూడా తప్పించుకోకుండా అతడి నోరు తెరుచుకునేది. అదే సమయంలో వోవా గురిచూసి కొట్టేవాడు. అతడు తన గురి సాధిస్తే ఓల్యా కుజినా తప్పట్లు కొట్టేది. "నేను గురిచూసి కొట్టే సైనికుడిని. వంద అడుగుల దూరంనుంచి కూడా ఎవరినైనా కొట్టగలను!" అంటూ వోవా గప్పాలు కొట్టేవాడు.

ఓల్యా కుజినా ఇంతింత కళ్లు చేసుకుని వోవా వంక చూసేది. ఆమె కనురెప్పలు మాత్రమే కొంచెం కదిలేవి. అటువంటి కనురెప్పల కోసం ఎవరైనా గొడవకి దిగుతారు. కానీ కోల్కా అందుకు సిద్ధంగా ఉండేవాడు కాదు.

"వీరుడైన ఇల్యా మ్యురొమెట్స్ గురించి నోనా యురెవ్నా చెప్పింది విన్నారా? ముప్పైమూడు ఏళ్లపాటు అతడు కోటను కాపాడాడంట. సంచార కళాకారులు వచ్చినప్పుడు—"

"నువ్వు నోరు తెరిచావు! నేను కాగితపు ఉండను గురిచూసి నీ నోట్లోకి కొట్టాను!"

"ఆ కాగితపు ఉండలో సిరా ఉంది!" ఓల్యా కుజినా కేరింతలు కొట్టింది.

"నువ్వు మందమతివి, నేను గురి తప్పకుండా కొట్టేవాడిని! కదా, ఓల్యా?"

వోవా ఇప్పుడు నేలమీద నుంచి బారెడు ఎత్తులో ఉన్నాడు. రెండు రోజుల క్రితం ఎంత ఇదిగా ఉన్నాడంటే తన వెదురు గొట్టం గురించి కూడా మరిచిపోయాడు. ఛాతీ పొంగించుకుని తిరుగుతూ అతడు గొప్పలు పోయాడు, “నాన్నని పని మీద పట్టణానికి పిలిచారు. తిరిగి వచ్చేటప్పుడు చేపలు పట్టడానికి వెదురు గాలం తెస్తానన్నాడు.”

ఫ్యొడార్ ఇపటొవిచ్ పట్టణానికి వెళ్లేముందు పెద్ద ఎత్తున విందు భోజనం ఏర్పాటు చేశారు. అతడి ప్రయాణం బాగా జరగాలని, త్వరగా, విజయవంతంగా తిరిగి రావాలని అందరూ ఆశీర్వదించారు. ఫ్యొడార్ ఇపటొవిచ్ కనుబొమ్మలు చిట్లించి, “ఉన్నట్టుండి నాతో వాళ్లకి ఏం పని పడింది?” అంటూ ఆలోచనలో పడ్డాడు.

“వాళ్లకి నీ సలహా కావాలి,” హారిటీనా అంది. “సలహా కోసం నీతో సమావేశం అవుతున్నారు, ఫ్యొడార్ ఇపటొవిచ్.”

"సమావేశమా?" అతడెందుకనో నిట్టూర్చాడు, "ఊం..."

"క్షేమంగా వెళ్లి, లాభంగా రా, ఫ్యోడార్ ఇపటొవిచ్!"

ఫ్యోడార్ తన మద్యం గ్లాసు ఎత్తి పట్టుకుని అందరికీ ధన్యవాదాలు చెప్పాడు. అయితే అతడు తాగకుండా తన గ్లాసు పక్కనపెట్టి ఆలోచనామగ్నుడయ్యాడు. "నన్ను పిలిచిన కారణం ఏమై ఉంటుందబ్బా?"

మంచి భోజనం, మద్యంతో కొంత ఆత్మ సంతృప్తితో ఫ్యోడార్ బయలుదేరి వెళ్లాడు. అతడు వెళ్లి వారం రోజులయ్యింది. ముందస్తు కబురు ఏమీ లేకుండానే – ఉత్తరం రాయలేదు, టెలిగ్రామూ పంపలేదు – ఒక రోజు అతడు తిరిగి వచ్చాడు. మారిట్సా హడావుడి పడిపోయింది. "అయ్యో, అయ్యో! తినటానికి ఏమీ లేకుండా అతిధులను ఎలా పిలుస్తాం?"

"కొంచెం ఆగు, మార్యా. అతిధుల అవసరం లేదు."

"అవసరం లేదంటే ఎట్లా, ఫ్యోడార్? ఇది సంప్రదాయం, మనం కావాలనుకున్నది కాదు."

"సరే పిలువు. వాళ్లు, వాళ్ల సాంప్రదాయాలు ఏడ్చినట్టే ఉన్నాయి..." కోపంగా అన్నాడు ఫ్యోడార్ ఇపటొవిచ్.

అతిధులను పిలిచి ఆర్భాటం చేయటమంటే ఫ్యోడార్ ఇపటొవిచ్‌కి ఇష్టం. అయితే అతడు తన అతిధులను జాగ్రత్తగా ఎంచుకునేవాడు. జిల్లా కార్యనిర్వాహక వర్గంలోని శిక్షకుడు అడపాదడపా వచ్చేవాడు (అతడికి తన పడుచు పెళ్లాం కంటే చేపలు పట్టటమంటే ఎక్కువ ఇష్టం!). స్థానిక సోవియట్ నుంచి కొంతమంది వస్తుండేవాళ్లు. వాణిజ్య సంచాలకులు, జనరల్ స్టోర్ మ్యానేజరు, గ్యారేజి అధికారి కూడా వస్తూ, పోతుండేవాళ్లు. ఎంతైనా ఈ రోజుల్లో లౌక్యంగా వ్యవహరించాలి. ఇక తన బంధువులైన యెగార్ పొలుష్కిన్, హార్యాలను ఎలా మరిచిపోగలడు?

"స్వాగతం, ఫ్యోడార్ ఇపటొవిచ్! జిల్లా కేంద్రానికి నీ ప్రయాణం ఎలా జరిగింది? ధరల పెరుగుదల గురించి బజారులో ఏమనుకుంటున్నారు? బయటి ప్రపంచం గురించి కబుర్లు ఏమిటి?"

సమాధానాలు చెప్పాలన్న తొందరలో ఫ్యోడార్ ఇపటొవిచ్ ఏమీ లేడు. దిగుమతి చేసుకున్న తన సూట్‌కేసును బయటకు తీసి, అతిధుల ముందే తెరిచాడు, "ఏవో చిన్న, చిన్న బహుమతులు – నన్ను తప్పు పట్టవద్దు. పెద్దగా ఉపయోగపడేవి ఏవీ లేవు – ఏదో జ్ఞాపకంగా ఉంటుందని తెచ్చానంతే."

ఒక్కళ్లని కూడా వదిలిపెట్టకుండా అందరికీ ఏదో ఒకటి తెచ్చాడు. ఆఖరికి యెగార్, హారిటీనాలకు కూడా: తప్పుతుందా మరి? కోల్కా కోసం అయస్కాంత దిక్సూచి కూడా తెచ్చాడు.

"ఇదిగో, అబ్బాయీ. ఇక దారి తప్పకుండా ఉంటావు."

కారణం తెలియదు గానీ ఈ మాటలకు అందరూ నవ్వారు. కానీ కోల్కా ముఖం వేగుచుక్క మాదిరి సంతోషంతో వెలిగిపోయింది: నిజమైన దిక్సూచి! దాంట్లో ఉత్తర-దక్షిణాలు, ఒక బాణం కూడా ఉన్నాయి.

'ఓయ్! సరంగు! పశ్చిమానికి నాలుగు పాయింట్లు! నిలకడగా పోనివ్వు!'

'ఆ, ఆ. నిలకడగానే పోనిస్తున్నాను!'

దిక్సూచితో అతడి ఊసులు మొదలయ్యాయి. అడవిలో దారి తప్పే విషయానికి వస్తే, మీకు మీ అపార్ట్‌మెంట్ ఎంత సుపరిచితమో, కోల్కాకి అడవి అంతగా పరిచితం. చెట్టుకు ఏ వైపున బెరడు గరుకుగా ఉంటుంది? మీకు తెలియదా? కోల్కాకి తెలుసు. అడవిలో కోల్కాకి దిక్సూచి అవసరం లేనేలేదు. కానీ అతడికి తన ప్రయాణాల్లో అది కావాలి. నిజానికి అతడు దానిని ఎంతగానో కోరుకున్నాడు.

'ఓడని నిలకడగా పోనివ్వు! భూమి ఎక్కడైనా కనపడుతోందా?'

'లేదు, కెప్టెన్! చుట్టూ తుఫాను కల్లోలిత సముద్రమే!'

'అదే దారిలో పోనివ్వు! భూమి ముందుంది!'

అతడు తనలో తాను అనుకుంటున్నాడు, బయటకు అని అకారణంగా ఇతరులను ఇబ్బందికి గురిచెయ్యటమెందుకు? వాళ్లకి ఏమీ అర్థం కాదు: కంగారు పడతారంతే.

చిన్నగా మడతపెట్టగల చేపల గాలం ఓవాకి తెచ్చాడు. "ఇక చేపలకు కొదవ ఉండదు!" అంటూ గప్పాలు మొదలుపెట్టాడు. "నాన్నా, నీ కోసం ఎటువంటి చేపలు పట్టుకోవాలి?"

"ఎంత పెద్దవైతే అంత మంచిది!" అక్కడున్న ప్రతి ఒక్కరు కేకపెట్టారు. "బాగా కొవ్వు ఉన్నవైతే ఇంకా మంచిది!"

ఫ్యోడార్ ఇపటొవిచ్ నవ్వాడు. కొడుకు బిరుసైన వెంట్రుకలు నిమురుతూ అతడు విచారంగా నవ్వాడు. ముఖ్యమైన అతిథులందరు వెళ్లిపోయిన తరువాత ఇక అతడు ఉగ్గబట్టుకోలేకపోయాడు: "కొత్త అటవీ వార్డెను నన్ను పిలిపించాడు. రాజధాని నుంచి వచ్చాడా ఖచ్చితమైన మనిషి. అడవి

సక్రమంగా ఎందుకు లేదని అడుగుతున్నాడు. ఏ నియమం ప్రకారం చెట్లు నరికారు, చీడపీడలకు వ్యతిరేకంగా ఎటువంటి నివారణ చర్యలు తీసుకున్నారు అని అడుగుతున్నాడు. మాట్లాడుతున్నంతసేపు పటాన్ని పరిశీలిస్తున్నాడు. ఇప్పటిదాకా మన అడవిలోకి కాలు కూడా పెట్టలేదు, అప్పుడే బెదిరించినట్టు మాట్లాడుతున్నాడు."

"అయ్యో," యెగార్ నిట్టూర్చాడు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఫ్యొడార్ ఇపటొవిచ్ అతనితో చెప్పుకుంటున్నాడు. దాంతో యెగార్‌కి కూడా తన కష్టాలు చెప్పుకోవాలనిపించింది, "నాకు కూడా, నీకు తెలుసు కదా – నాకూ... కష్టాలు ఉన్నాయి. "

కానీ యెగార్ కష్టాల పట్ల ఫ్యొడార్ ఇపటొవిచ్‌కి సానుభూతి ఎందుకుంటుంది: తన కష్టాలు తనకు ఉన్నాయి.

"ఆ, ఏం పర్వాలేదు. అతడే దారికి వస్తాడు. ఇంతకంటే గట్టివాళ్లనే జీవితం చితక్కొట్టింది. ఇతడు కూడా గతిలేక దేబిరిస్తూ నా ముందు మోకరిల్లుతాడు. నా సహాయం లేకుండా ఏ అటవీ వార్డెను ఇక్కడ మనలేడు – నాకు ఇక్కడి లోగుట్టులన్నీ తెలుసు. శనివారం రాత్రి అయితే ఎవరు ఎక్కడికి చేరతారో కూడా నాకు తెలుసు. ఎవరు ఎవరితో తాగుతారో, ఆ తరువాత వాళ్లు ఎలా ఉంటారో నాకు తెలుసు."

"అవును, ఎవరు ఎక్కడ ఉంటారో... అవును, ఎవరు ఎలా ఉంటారో..." యెగార్ గొణుగుతున్నాడు.

అతడు రెండు గ్లాసుల మద్యం తాగి తన కష్టాల గురించి తలపోయసాగాడు.

యకోవ్ ప్రొకొపిచ్‌కి మొదటసారి కోపం వచ్చేలా చేసినందుకు అతడికి చాలా విచారంగా ఉంది. ఎంతో కష్టంమీద పర్యాటక కేంద్రం వద్ద సంపాదించిన ప్రశాంతమైన, గౌరవప్రదమైన ఉద్యోగం ఎక్కడ పోతుందోనన్న భయం కూడా ఉంది.

"నేను, నీకు తెలుసు కదా, ఏది ఎక్కడ ఉందో స్పష్టంగా తెలుస్తుందనుకున్నాను. అప్పుడు ఒకదానికోసం వెతికే పని ఉండదు, అంతేకాకుండా అవి అందంగా కూడా ఉంటాయి."

"కలప అమ్మకాల జమాఖర్చులు పూర్తయ్యాయా అని అడిగాడు," ఫ్యొడార్ తన సమస్యలను వెళ్లబోసుకుంటున్నాడు. "అలాగే, నీ కోసం లెక్కలు తయారు చేస్తాను. అన్నింటి మీద నిఘా ఉంచాలనుకుంటున్నావు కాబట్టి నీకు జమాఖర్చు లెక్కలన్నీ ఇస్తాను. మరి నీ మీద కూడా నిఘా

ఉంచుతాను. ఆపైన ఈ ఉద్యోగంలో నువ్వు ఎక్కువ కాలం కొనసాగలేవు. లేదండి, ఎక్కువ కాలం —"

"అతడు అన్నింటికి నీలం రంగు వెయ్యమంటాడు. అన్నింటికీ నీలం, లేదా ఎర్ర రంగు వేశాం అనుకుందాం – ఏమవుతుంది? తేడా పట్టనట్టు ఉంటుంది –"

"పట్టనట్టు ఉండటం?" ఫ్యొడార్ ఇపటొవిచ్ తన ఎర్రటి కళ్లను మిటకరించాడు (తన విచారంలో అతడు కూడా బాగానే తాగాడు). "బాగా చెప్పావు, బావమరిది, పట్టనట్టు ఉండాలి. అతడిని ఏమాత్రం పట్టించుకోం. సరికి సరి చేస్తాను, నేను –"

"అదీ," యెగార్ తలఊపాడు. "అందం — అంతా ఒకేరకంగా ఉండటమే అందమంటావా? అందమంటే అంతా వేరువేరుగా ఉండటం! ఒకటి ఉదాహరణకు నీలంగా ఉంటే, రెండవది అందుకు విరుద్ధంగా ఎర్రగా ఉంటుంది. అందం లేకుండా ఎలా మనగలుగుతాం? అందాలు లేకుండా సంబరాలు లేవు. అందం, అది –"

"దేని గురించి వాగుతున్నావు, నిత్య దరిద్రుడా? అందం అమిటి? అతడు నా ఇంటికి డబ్బులు అడుగుతున్నాడు — డబ్బులు, తెలిసిందా? నువ్వూ, నీ అందం! హుఁ!"

ఫ్యొడార్ గురించి ఆలోచిస్తూ యెగార్ తనలో తాను నవ్వుకున్నాడు: అనవసరంగా అతడిని చిరాకుపరచటం ఎందుకు? కానీ యెగార్ అసంతృప్తికి లోనయ్యాడు. తన బాధలను పంచుకోలేకపోయానన్న అసంతృప్తి. అసంతృప్తితో నిద్రకు ఉపక్రమించటం అంటే — అదీ రెండు గ్లాసుల మద్యం పుచ్చుకున్న తరువాత — కలలోకి దెయ్యాలను ఆహ్వానించటమే. తోకలు, కొమ్ములు, గిట్టలతో నిజమైన దెయ్యాలు. అది భయంకరమైన కల: దెయ్యాలు నీ పీక నులమటానికి వస్తాయని పెద్దవాళ్లు చెబుతారు. దెయ్యాలకు అన్నీ తెలుసు. అవి వాటి జీవితకాలంలో — కష్టాల్లో, సుఖాల్లో — ఒనేగా చెరువు నిండేటంత మద్యం తాగి ఉంటాయనటంలో అనుమానం లేదు.

యెగార్ పక్కమీద అటూ, ఇటూ దొర్లాడు, నిట్టూర్చాడు, తనను తాను నిందించుకున్నాడు. తాను ఎందుకూ పనికిరాని అసమర్థుడు, దేవుడికి కూడా పనికిరానివాడు!

ఈ ఉద్యోగంలో యెగార్ చాలా మనసు పెట్టాడు — మధ్య, మధ్యలో చుట్ట కాల్చటానికి విరామం తీసుకోవటం కూడా మరిచిపోయేవాడు. కోడె గిత్త మాదిరి చురుగ్గా అడుగులు వేసేవాడు.

"ఓయ్, పొలుష్కిన్ –" ఏదో చెప్పటానికి డైరెక్టరు నోరు తెరుస్తాడో లేదో "తెలిసింది, యకోవ్ ప్రొకొపిచ్!" అనేవాడు.

అలా అంటూనే ఆ పని చెయ్యటానికి పరిగెత్తేవాడు. అంతా సరిగా అర్థం అయ్యిందా సరేసరి; కాకపోతే వివరణ కోసం మళ్లీ పరిగెత్తుకుంటూ వచ్చేవాడు. కాబోయే అత్తగారిని మెప్పించటానికి కోడలు పిల్ల పడే పాట్లు మాదిరి ఉండేవి అతడి చేష్టలు.

"పడవలలోకి నీళ్లు రాకుండా బాగా చేశావు, పొలుష్కిన్. తారు కూడా బాగా పూసావు. ఆ విషయం ఒప్పుకోవాలి... ఆగు – ఎక్కడికి వెళుతున్నావు?"

"నేను –"

"ముందు నేను చెప్పింది విని ఆ తరువాత పరుగులు తియ్యి. ఇప్పుడు పడవలను చక్కగా తీర్చిదిద్దాలి. వాటన్నింటికి నీలం రంగు వెయ్యి. తెడ్లకు, వాటి కింది భాగానికి ఎర్ర రంగు వెయ్యి – అర్థమయ్యిందా? ఎవరన్నా వాటిని నీటిలోకి జారవిడిస్తే, ఎంత దూరం నుంచైనా అవి కనపడతాయి. ప్రతి పడవ ముందు భాగాన ఒక నెంబరు వెయ్యాలి. నెంబరుకి ఎప్పుడూ నల్ల రంగు వెయ్యాలి. ఇవిగో రంగులు, ఇవిగో బ్రష్షులు. నెంబర్లు ఉన్న కాగితం ఇదిగో. పడవ మీద ఒక నెంబరు వేయగానే దానిని కొట్టెయ్యి, అప్పుడు గందరగోళం ఉండదు. రెండవ నెంబరు వేయగానే దానిని కూడా కొట్టెయ్యి. అర్థమయ్యిందా, పొలుష్కిన్?"

"అర్థమయ్యింది, యకోవ్ ప్రొకొపిచ్. దీంట్లో అర్థం కాకపోవటానికి ఏముంది?" రంగు డబ్బాలు తీసుకుని అతడు పరుగందుకున్నాడు, చెప్పులు లేని అతడి పాదాలు తళుక్కుమంటున్నాయి. ఇంటి నుంచి పనికి వచ్చేటప్పుడు, తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు మాత్రమే అతడు చెప్పులు వేసుకునేవాడు. పనిలో చెప్పులు లేకుండానే తిరిగేవాడు. చెప్పులు లేకుండా ఉంటేనే హాయిగా ఉంటుంది, తొందరగా నడవవచ్చు, అంతేకాదు చెప్పులు అనవసరంగా అరిగిపోకుండానూ ఉంటాయి.

మూడు రోజులపాటు పడవలకి నీలం రంగు వేసాడు. రోజుకి ఎనిమిది గంటల పనేమిటి, ఓపిక ఉన్నంతసేపు పనిచేసేవాడు. యకోవ్ ప్రొకొపిచ్ అన్నింటి లెక్కలు చూసుకుని, తాళాలు వేసి, అన్ని సరి చూసుకుని ఇంటికి వెళ్లటానికి సిద్ధంగా ఉండేవాడు. అప్పటికి యెగార్ ఉత్సాహంగా పని చేస్తుండేవాడు.

"పూర్తి చెయ్యి, పొలుష్కిన్."

"ఒక్క నిమిషం, యకోవ్ ప్రొకొపిచ్, ఒక్క నిమిషం."

"ఇప్పటికే నాలుగు దాటింది. సమయం మించిపోయింది."

"నువ్వు వెళ్లు, యకోవ్ ప్రొకొపిచ్. రంగులు, బ్రష్షల గురించి నువ్వు చింతించవద్దు: వాటిని నాతో ఇంటికి తీసుకుని వెళతాను."

"అలాగయితే సరే, పొలుష్కిన్."

"మంచిది, యకోవ్ ప్రొకొపిచ్! ఇంటి దగ్గర వాళ్లను అడిగానని చెప్పు."

సమయం వృధా అవుతుందని అతడు వెనక్కి కూడా తిరిగి చూడలేదు. రెండు వరసలు రంగు వేసి, గట్టిగా ఊపిరి వదిలాడు. నాలుక బయటపెట్టి సంతృప్తిగా చూసుకున్నాడు. పడవల మీద రంగు ఆరుతుండగా తెడ్లమీదకి దృష్టి మళ్లించాడు. ఇక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టాడు, తొందరపెడితే ఎరుపుకి నచ్చదు. ఎక్కువ వేస్తే చల్లగా, ముద్దగా, జారిపోయినట్టుగా అవుతుంది; అప్పుడది ఊదా రంగులాగా కనపడుతుంది. రంగుల గురించి యెగార్‌కి తెలుసు: అతడు ఇళ్లకి రంగులు వేసాడు. రంగుల పట్ల అతడికి ఒక అవగాహన ఉంది, ఒకరకంగా చాలా చిన్నప్పటినుంచే అతడికి ఆ దృష్టి ఉంది. దాంతో అతడు అనేక రకాలుగా ప్రయత్నించి చివరికి అతడికి కావలసిన విధంగా ఎర్ర రంగు వేసాడు. తెడ్డు పలకలు మండుతున్నట్టు ఉన్నాయి – ఎంతో దూరం నుంచి కూడా వాటిని గుర్తించవచ్చు.

ఆ తరువాత నెంబర్లు వేయటం మొదలుపెట్టాడు. అయితే మొదటి రెండు నెంబర్లు (జాబితా ప్రకారం 7, 9 నెంబర్లు) వేసిన తరువాత అతడి చెయ్యి వేలాడబడిపోయింది. నీలం మీద నలుపు ఏమాత్రం బాగాలేదు. ఎంతైనా నెంబరు నెంబరే, అంతకు మించి అందులో ఏమీలేదు. ఒట్టి గణితం. నీలాకాశం మీద గణితం ఇబ్బందిపెడుతుంది, వ్యక్తి ఉల్లాసాన్ని నీరుకారుస్తుంది. కొంత విశ్రాంతి, కొంత వినోదం కోసం ఉల్లాసంతో వచ్చిన వ్యక్తే పడవను తీసుకుంటాడు. అటువంటి వ్యక్తికి నీలం మీద నలుపుతో తొమ్మిదవ నెంబరు పడవ ఇచ్చారనుకుందాం. అది ఇంటిని గుర్తుకు తెస్తుంది, ఆ వెంటనే అత్తగారు గుర్తుకు వస్తారు. ఇక అతడి ఉల్లాసం నీరుగారిపోతుంది.

ఉన్నట్టుండి యెగార్‌కి ఒక ఆలోచన తట్టింది. అతడికి మనసులో ఒక స్పష్టత ఏర్పడింది – దాంతో అతడు బ్రష్షు కింద పడేసి పడవల చుట్టూ పరుగుపెట్టాడు. ఒక్కసారిగా అతడు

ఆనందంలో మునిగిపోయాడు. అది అతడిని కుదిపివేసింది. అటువంటి ఆనందం అతడు ఎన్నడూ చవిచూడలేదు, అతడికి ఏదేదోగా ఉంది – ఆ ఉత్సాహంతో అతడు బ్రష్షును కూడా పట్టుకోలేకపోయాడు. ఉన్నట్టుండి ఏదో భయపెట్టినట్టుగా ఉంది, కానీ అది నవ్వుతూ, మంచిగా ఉంది.

మరొకరి అభిప్రాయం కూడా తీసుకుంటే బాగుంటుంది. అయితే, యకోవ్ ప్రొకొపిచ్ ఎప్పుడో ఇంటికి వెళ్లిపోయాడు. యెగార్ కాసేపు చుట్ట కాల్చాడు. అయినా, అతని మనసు నిదానించలేదు. బ్రష్షు తీసుకుని కష్టపడి వేసిన "7", "9" నెంబర్ల మీద రంగు వేసాడు. తరువాత గట్టిగా ఊపిరి తీసుకుని జేబు లోపలనుంచి పెన్సిలు బయటకు తీసాడు.

ఆ రోజు రాత్రి బాగా పొద్దు పోయేవరకు పనిచేసాడు. అదృష్టవశాత్తు రాత్రుళ్లు అంత చలిగా లేవు. అతడి భార్య ఇంటిలోపలినుంచి బయటవరకు అయిదుసార్లు పరిగెత్తింది. తన భర్త చెరువులోగాని పడిపోలేదు కదా అనుకుంటూ అలవాటు తప్పకుండా ఉండటానికి శోకాలు తీయటానికి ప్రయత్నించింది. కానీ, తను చేపట్టిన పని పూర్తయ్యేవరకు, బ్రష్షులన్నీ కడిగేవరకు, తనివి తీరా తన పనిని చూసుకున్న తరువాత గానీ యెగార్ ఇంటికి బయలుదేరలేదు.

"రాత్రంతా ఎక్కడ తిరుగుతున్నావు ఎందుకూ పనికిరాని ఏమీ చేతకాని –"

"పని చేస్తూ ఉన్నాను, టీనా," యెగార్ ప్రశాంతంగా బదులిచ్చాడు. "ఇక మాట్లాడకు: ఎంతో ఉపయోగపడే పని చేసాను. రేపు యకోవ్ ప్రొకొపిచ్ ఆశ్చర్యపోతాడు."

ఆ రాత్రి అతడికి నిద్ర పట్టలేదు. తెల్లవారిన తరువాత ఇక ఉండబట్టలేక యెగార్ చెరువు దగ్గరికి పరిగెత్తాడు. తన కళాత్మక కృషిని మరొక్కసారి తనివి తీరా చూసుకున్నాడు. డైరెక్టరు రాక కోసం ఆతృతతో కూడిన ఉత్సాహంతో ఎదురుచూడసాగాడు.

"అదిగో!" శుభోదయం చెప్పకుండానే అతడితో అన్నాడు. "నాకు రాత్రి వచ్చిన ఆలోచన చూడు."

యకోవ్ ప్రొకొపిచ్ దీర్ఘంగా, నిశితంగా చాలాసేపు చూసాడు. అతడి ముఖంలో నవ్వులేదు. కానీ యెగార్ మాత్రం నోటిని ఈ చెవినుంచి, ఆచెవి వరకు సాగదీసుకుని బుగ్గలు నొప్పిపుట్టేటంతగా నవ్వుతున్నాడు. "ఊఁ," చివరికి యకోవ్ ప్రొకొపిచ్ అన్నాడు. "ఏమిటి దీనర్థం?"

"యానిమేషన్," యెగార్ వివరించాడు. "నెంబరులో ఏముంది, ఎంతైనా? ఒట్టి గణితం. నీలం మీద నలుపు: దూరం నుంచి సరిగా కనపడను కూడా కనపడదు. ఉదాహరణకు మీరు ఏడవ నెంబరు పడవ బయటకు తియ్యి అన్నారనుకుందాం. బాగానే ఉంది, అప్పుడు ఏడవ నెంబరు పడవ కోసం వెతకాలి. కానీ ఇక్కడు చూడండి పడవ ముందు భాగంమీద బొమ్మ ఉంది: ఒక బాతుపిల్ల. ఎవరికైనా బాతుపిల్ల వెంటనే కనపడుతుంది."

ఆకాశం నీలం మీద ఒట్టి నల్లటి నెంబర్లు కాకుండా మెరిసిపోతున్న రంగులలో బొమ్మలు వేసి ఉన్నాయి: బాతుపిల్ల, కుక్కపిల్ల, మందారపువ్వు, కోడిపిల్ల. యెగార్ వాటిని వాస్తవంతో సంబంధం లేకుండా క్యారికేచర్ల మాదిరి వేశాడు. అయితే ప్రతి బొమ్మలోనూ వివరాలను ఖచ్చితంగా పట్టుకున్నాడు: కుక్కపిల్ల చెవులు వంపు తిరిగి ఉన్నాయి, మందారపువ్వు కాడ దాని బరువుకి వంగి ఉంది, బాతుపిల్ల నోరు నవ్వుతూ తెరుచుకుని ఉంది.

"వీటితో అందరికీ సరదాగా ఉంటుంది," యెగార్ ఉత్సహంగా చెప్పుకుంటూ వెళ్లాడు. "నేను కోడిపిల్ల మీద ఉన్నాను. మీరు పందిపిల్ల మీద ఉన్నారనుకుందాం. నన్ను పట్టుకోటానికి ప్రయత్నించు! పందాలు."

"పందాలా?" యకోవ్ ప్రొకొపిచ్ ఆందోళనతో అన్నాడు. "బాతుపిల్లకీ, పందిపిల్లకీ? అలాగా. బాగుంది. ఒకవేళ, దేవుడి దయవల్ల అలా జరగకుండా ఉండుగాక, ఎవరి పడవైనా తిరగబడిపోతే? ఎవరైనా పడవని దొంగలిస్తే (దేవుడి దయవల్ల అలా జరగకుండా ఉండాలి)? ఒకవేళ అది గాలికి కొట్టుకుపోతే (అది నీ తప్పు అవుతుంది)? అప్పుడు పోలీసులకు నేను ఏమని చెప్పాలి? మా కోడిపిల్లను కాపాడమనా? పందిపిల్ల కోసం వెదకమనా? ఎవరో మా మందారపువ్వుని ఎత్తుకుపోయారనా? ఆఁ?!"

"అదీ... "

"అదీ, ఇదీ కట్టిపెట్టి ఆ చెత్త బొమ్మలమీద రంగు వేయటం మొదలుపెట్టు! ఎక్స్‌రే తీసినా కనపడనంతగా ఆ బాతు-పంది వాటన్నింటిమీద రంగు వెయ్యి! ఈ క్షణం వాటిమీద రంగు వేసి, కోతి పనులు చేయకుండా నీకు ఇచ్చిన జాబితా ప్రకారం నెంబర్లు వెయ్యి. ఇది చిన్న పిల్లల బడి కాదు, సాంస్కృతిక ప్రదేశం: పార్టీ కమిటీ నుంచి ఎవరైనా రావచ్చు. పార్టీ కమిటీ కార్యదర్శిని మందారపువ్వులో ఎక్కించగలనా, ఆఁ? ఎక్కించగలనా? నీ బాతుపిల్లల గురించి, పందిపిల్లల

గురించి వాళ్లు ఏమంటారు, ఆఁ? నీకు తెలియదు? కానీ నాకు తెలుసు: అబ్‌స్ట్రాక్టు. అబ్‌స్ట్రాక్టు అంటారు, పొలుష్కిన్."

"ఏమంటారు?"

"నా ఓపికను పరీక్షించవద్దు, పొలుష్కిన్," యకోవ్ ప్రొకొపిచ్ గట్టిగా చెప్పాడు. "నన్ను పరీక్షించవద్దు. కవుకు చెట్టు పడి నా మెదడు సరిగా పనిచెయ్యటంలేదు. అలాగని నిరూపించటానికి నా దగ్గర కాగితాలు ఉన్నాయి. కాబట్టి తెడ్డుతో ఈడ్చి నీ తలమీద..."

యెగార్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. మనసుపెట్టి, శ్రమించి సృష్టించిన బొమ్మల మీద రంగువేయటం ఎంతోసేపు తీసుకున్నట్టు విసుగ్గా అనిపించింది. అతడు నిట్టూర్చాడు. కానీ ఆ మొండి బాతుపిల్ల, పందిపిల్ల ఆరిన ప్రతి రంగుపొర కిందనుంచి తొంగి చూస్తూనే ఉన్నాయి. యెగార్ బ్రష్షు తీసుకుని జానపద కథలలో మాదిరి నవ్వుతూ ఉన్న ఆ బొమ్మలమీద మళ్లీ రంగు వేసేవాడు. తరువాత చాలా నిరాసక్తంగా , కష్టంమీద నల్లని రంగులో నెంబర్లు వేసాడు, జాబితా ప్రకారం.

చెప్పినట్టుగానే అంతా చేశానని యెగార్ చెప్పిన తరువాత, "నువ్వు ప్రమాదకరమైన మనిషివి, పొలుష్కిన్," అంటూ యకోవ్ ప్రొకొపిచ్ నిట్టూర్చాడు.

ఒక ఫ్లాస్క్ నుంచి యకోవ్ ప్రొకొపిచ్ టీ తాగేవాడు. దానిమీద పెద్ద పొట్ట ఉన్న ఒక వింతైన చేప, కోడిపుంజు ఈకలు ఉన్నాయి. ఒక కాలు మీదనుంచి మరొక కాలుమీదకి మారుతూ యెగార్ వాటివంకే చూస్తున్నాడు.

"వాళ్లు నన్ను హెచ్చరించారు," డైరెక్టరు చెపుతూ పోతున్నాడు. "ఫోర్‌మెన్లందరూ హెచ్చరించారు. నువ్వు ఏదో అశాంతితో ఉంటావని, ఏవో ఊహాలోకాల్లో ఉంటావని చెప్పారు. నేను వాళ్ల మాటలు నమ్మలేదు."

యెగార్ నిశ్శబ్దంగా నిట్టూర్చాడు, కానీ క్షమించమంటూ ఒక్క మాట అడగలేదు. క్షమాపణ — కనీసం భవిష్యత్తు భద్రత కోసమైనా — అడగాలని, యకోవ్ ప్రొకొపిచ్ ఆ మాట కోసమే చూస్తున్నాడనీ అతడికి తెలుసు, కానీ అతడు అడగలేకపోయాడు. తన పైఅధికారి అభిప్రాయంతో ఏకీభవించలేకపోతున్నాడు కాబట్టి అతడు క్షమాపణ అడగలేకపోయాడు. యకోవ్ ఫ్లాస్క్‌తో అతడికి తాదాత్మ్యం ఉంది.

"నువ్వు సరైన విధంగా జీవించాలి, పొలుష్కిన్. ఫలాన, ఫలాన విధంగా చెయ్యమని చెబితే నువ్వు అలాగే చెయ్యాలి. అలాకాకుండా ప్రతి ఒక్కరికి సొంత ఆలోచనలు ఉంటే... ఏమవుతుందో తెలుసా?"

"ఏమవుతుంది?" అడిగాడు యెగార్.

యకోవ్ ప్రొకొపిచ్ రొట్టె తినటం ముగించి, ఆఖరి గుక్క టీ తాగేశాడు. తరువాత తీవ్రంగా, "దానిని ఊహించటానికి కూడా సాహసించను."

"మరి రోదసి సంగతి ఏమిటి?" యెగార్ ఎందుకనో అడిగాడు (అతడికి ఈ రోజు ఏమయ్యింది?). "ముందు అది ప్రజల భ్రమ అనుకున్నారు: నేను అది రేడియోలో విన్నాను. ఇప్పుడు –"

"ఎప్పుడైనా బూతులు విన్నావా?"

"అప్పుడప్పుడు," యెగార్ నిట్టూర్చాడు.

"ఏమిటది? బూతులంటే చట్ట విరుద్ధ తిట్లు, తెలిసిందా? చట్ట బద్ధమైన తిట్లు కూడా ఉన్నాయి. అవునా? ఊహలకు కూడా ఇదే వర్తిస్తుంది: చట్ట బద్ధమైనవి, చట్ట విరుద్ధమైనవి ఉంటాయి. నీవి సెన్సారు పడని ఊహలు."

"పందిపిల్ల, బాతుపిల్ల చట్ట విరుద్ధమైనవని అంటున్నావా?" యెగార్ అనుమానంగా అడిగాడు.

"నేను విస్తృతార్థంలో మాట్లాడాను, పొలుష్కిన్."

"విస్తృతార్థంలో అవి బాతు, పంది అవుతాయి."

"పందికి జతగా బాతు ఉండలేదు!" యకోవ్ ప్రొకొపిచ్ ఒక్కసారిగా మండిపడ్డాడు. "నా ముందునుంచి వెళ్లిపో, లేకపోతే నా చట్ట విరుద్ధ ఊహలను నీ మీద ప్రయోగించాల్సి వస్తుంది!"

ఇది జరిగిన కొన్ని రోజులకు ఫ్యొడార్ ఇపటొవిచ్ పట్టణం నుంచి తిరిగివచ్చాడు. ఊరంతా అతడిని పలకరించటానికి వెళ్లింది. యెగార్ రెండు గ్లాసులే తాగినా తాను వంటరినై ఆందోళనకు ఎందుకు గురౌతున్నాని బాధపడసాగాడు.

అయితే అతడు అనవసరంగా ఆందోళనపడ్డాడని త్వరలోనే తెలిసింది. తాను అనాల్సిందంతా అన్న తరువాత యకోవ్ ప్రొకొపిచ్ అతడి పట్ల ఎటువంటి ద్వేషభావం

ఉంచుకోలేదు, అసలు ఆ ఘటన గురించే మరిచిపోయాడు. యెగార్ ముఖంలో చిరునవ్వు మళ్లీ తిరిగొచ్చింది, చెప్పులు లేని కాళ్లతో అతడు అటూ, ఇటూ పరిగెడుతున్నాడు.

"తెలిసింది, యకోవ్ ప్రొకొపిచ్!"

అయితే దురదృష్టం ఇంకొకవైపునుంచి కమ్ముకుంటూ వస్తోంది. వర్షాకాలపు మబ్బు మాదిరి పెద్ద విపత్తు. అయితే ఎవరికీ రాబోయే విపత్తు గురించి ముందుగా తెలిసే అవకాశం లేదు. అందుకే అది పిడుగుపాటు మాదిరి అతని మీద పడుతుంది. నిట్టూర్చి, తలగోక్కోవటం తప్పించి చెయ్యగలిగింది ఏమీ లేదు.

"ప్రపంచం అలాగే ఉందనుకుంటా!"

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com